జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# ఉచిత లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం



**మిడ్జిల్ జూన్ 27 (జర్నలిస్ట్ డైరీ)**
పాడి పశువులను లంపి స్కిన్ గాలికుంటు వ్యాధి నుంచి రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత టీకాల కార్యక్రమంలో భాగంగా మిడ్జిల్, బోయిన్పల్లి గ్రామాల్లో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు నెలలు నిండిన దూడలు, పాడి పశువులు, దుక్కి దున్నే పశువులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 456 పశువులకు టీకాలు అందజేశారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనుప శివరాజ్ మాట్లాడుతూ, లంపి స్కిన్ వ్యాధి సోకిన పశు వులకు తీవ్రమైన జ్వరం, చర్మంపై బొబ్బలు, నోటిలో పుండ్లు ఏర్పడడంతో పాటు పాడి పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. పని పశు వుల పనితీరు కూడా దెబ్బతిని రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుందని వివరించారు. వ్యాధి తీవ్రత పెరిగితే పశువులు మేత, నీరు తీసుకోవడం మానేసి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుందని హెచ్చరించారు. రైతులు మూడు నెలల వయస్సు దాటిన దూడలకు, పెద్ద పశువులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి, అంటే ఏడాదికి రెండుసార్లు లంపి స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి పశుపాలక రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సత్యం, నర్సింలు, పాండు, గోపాలమిత్రలు మల్లేష్, నరసింహ, యాదగిరి, వేణుగోపాల్, రామకృష్ణతో పాటు పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు.. పోలియోను తరిమికొట్టేద్దాం

**- సర్పంచ్ ముచ్చమఱ్ఱి అనురాధ రమేష్**




**దౌల్తాబాద్, జూన్ 27 (జర్నలిస్ట్ డైరీ)**
ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని దౌల్తాబాద్ సర్పంచ్ ముచ్చమఱ్ఱి అనురాధ రమేష్ పిలుపునిచ్చారు. శనివారం ఆమె మాట్లాడుతూ, నిండు ఆరోగ్యవంతమైన జీవితానికి రెండు చుక్కల పోలియో మందే కీలకమని అన్నారు. ఎంత ముఖ్యమైన పనిలో ఉన్నప్పటికీ ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం మర్చిపోవద్దని సూచించారు. భారత్ ప్రస్తుతం పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందినప్పటికీ, కొన్ని దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు పూర్తి రక్షణ కల్పించేందుకు ప్రతి పల్స్ పోలియో కార్యక్రమంలో పోలియో చుక్కలు వేయించడం ఎంతో అవసరమని తెలిపారు. పోలియో నిర్మూలనలో దేశం సాధించిన విజయాన్ని కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. జూన్ 28న జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు.

# పేదలకు వరం ఇందిరమ్మ ఇల్లు

**- ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు**





**టేక్మాల్ జూన్ 27 (జర్నలిస్ట్ డైరీ)**
మెదక్ జిల్లాటేక్మాల్ మండల కేంద్రం టేక్మాల్‌లో లబ్ధిదారులు శ్రీ చిట్యాల శారద & శ్రీ బలరాం వారి ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీ తిమ్మిగారి సుధాకర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. టేక్మాల్ మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సుబేదార్ మణికిషన్, ఉప సర్పంచ్ శంకరయ్య, మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య , జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాగర్ , అలాగే చిట్యాల బాలరాజు , కుమ్మరి ధనుంజయ్య గ, సోలాపూర్ రాజు తదితర కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని లబ్ధిదారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించాలనే మహత్తర లక్ష్యంతో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం, ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, కొత్త వెలుగులు నింపుతోంది.

# బోడపాడులో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి



**గుర్రంపోడు, జూన్ 27 (జర్నలిస్ట్ డైరీ)**
నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం బోడపాడు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నూతన నాభిశిల ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో శనివారం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో దేవాలయాల నిర్మాణం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ సమాజంలో సత్సంకల్పాలను పెంపొందిస్తుందని అన్నారు. భక్తి భావనతో ప్రజలు ఐకమత్యంగా ఉంటే గ్రామాభివృద్ధితో పాటు సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుర్రంపోడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్ము శ్రీనివాస్ యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమ దాత చిరుమనేని సుదర్శన్ రావు, దేవాలయ కమిటీ సభ్యులు బూరుగుపల్లి శ్రీను, కృష్ణ, గంట రమేష్, రాసాల శ్రీను, సైదులు, రాజు, వెంకన్న, నితిన్, కట్టెబోయిన వెంకన్న, ముంగి వెంకన్న, పుట్టపాక అర్జున్, రాయనబోయిన పెద్ద వెంకన్న, చిన్న వెంకన్న, బోడపాడు గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ,రోస్టర్ విధానంతో మాలలకు అన్యాయం: గోలి సైదులు

- ఉద్యోగాలు, పదోన్నతుల్లో మాలలకు నష్టం జరిగిందని ఆరోపణ
- ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాల మహానాడు నాయకులు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడి



**నల్గొండ, జూన్ 27 (జర్నలిస్ట్ డైరీ)**
ఎస్సీ వర్గీకరణ అమలు, రోస్టర్ పాయింట్ విధానం కారణంగా మాల జాతికి ఉద్యోగాలు, పదోన్నతులు, ఉపాధి అవకాశాల్లో తీవ్ర అన్యాయం జరిగిందని జాతీయ మాల మహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోలి సైదులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎస్సీ కోటా కింద గతంలో జరిగిన నియామకాలలో మాలలకు ఎన్ని పోస్టులు లభించాయో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే వర్గీకరణ అమలుకు ముందు, తర్వాత ఉద్యోగాల పంపిణీలో చోటుచేసుకున్న మార్పులు, రోస్టర్ పాయింట్ విధానం వల్ల మాల వర్గం కోల్పోయిన అవకాశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. మాల జాతిపై వర్గీకరణ ప్రభావంపై ప్రభుత్వం ఏదైనా సమగ్ర అధ్యయనం లేదా నివేదిక రూపొందించిందా అనే విషయాన్ని కూడా స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశాలపై రేపు నల్గొండ పర్యటనకు రానున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా వినతిపత్రం సమర్పించి, మాల జాతికి జరిగిన అన్యాయంపై న్యాయం చేయాలని కోరనున్నట్లు తెలిపారు. రోస్టర్ పాయింట్ విధానం వల్ల ఏర్పడిన సమస్యలను ప్రభుత్వం వెంటనే సమీక్షించి, మాల వర్గానికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలుతో మాల వర్గంపై ఏర్పడిన ప్రభావంపై సమగ్ర అధ్యయనం నిర్వహించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మాల జాతి హక్కులు, సమాన అవకాశాల పరిరక్షణ కోసం తమ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని గోలి సైదులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలగమల్ల యాదగిరి, చింతపల్లి లింగమయ్య, బోకర్ విజయ్‌కుమార్, మేకల కృష్ణయ్య, రవి, మాల మహానాడు రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు పోచబోయిన సురేష్ యాదవ్



**మన్సూరాబాద్, జూన్ 27 (జర్నలిస్ట్ డైరీ)**
హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని చంద్రపురి కాలనీలో ఉన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం వద్ద నిర్వహించిన పట్టాభిషేక మహోత్సవంలో మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోచబోయిన సురేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యసాహసాలు, పరిపాలనా దక్షత, ధర్మరక్షణ కోసం చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, దేశభక్తి, ధర్మ పరిరక్షణ వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ పెద్దలు, యువకులు, సామాజిక సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనాథలు, వృద్ధులకు అండగా కృష్ణ గోపాల్ సేవా సమితి









**ఎల్.బి. నగర్, జూన్27 (జర్నలిస్ట్ డైరీ)**
కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నాలుగు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సమాజ సేవే లక్ష్యంగా కృష్ణ గోపాల్ సేవా సమితి చేపట్టిన ఈ కార్యక్రమాలు అనాథలు, వృద్ధులు, భక్తులకు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయి. మొదటగా సుమారు 250 మంది అనాథ చిన్నారులకు ఉదయం అల్పాహారం అందించారు. రెండవ కార్యక్రమంలో లూధియానా నివాసి స్వర్గీయ ఆశా అగ్రవాల్ నెలవారీ శ్రద్ధాంజలి సందర్భంగా వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు ఉదయం అల్పాహార సేవ నిర్వహించారు. మూడవ కార్యక్రమంగా కర్మన్‌ఘాట్ శ్రీ హనుమాన్ ఆలయం వద్ద “జై శ్రీరామ్” నినాదాల మధ్య సుమారు 1,500 నుంచి 2,000 మంది భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాన్ని అభినందించారు. నాలుగవ కార్యక్రమంలో అంబాలా నివాసి స్వర్గీయ శ్రీ సోమనాథ్ గుప్తా జన్మదినాన్ని పురస్కరించుకుని అనాథ పిల్లలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమాలన్నింటిలో కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు డా. కపిల్ కుమార్ అగ్రవాల్తో పాటు సమితి అధికారులు, సభ్యులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, “మానవ సేవే మాధవ సేవ” అనే భావనతో సమాజంలోని అవసరమైన వర్గాలకు సేవలందించడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

